సింగిల్ పేజీ కథ

# రోకలి పూజ

హరికిషన్

ఒకూర్లో రంగయ్య అని ఒకడుండేటోడు. వానికి బంధువులంటే చానా చానా ఇష్టం. ఇంటికి ఎవరు వచ్చినాసరే వాళ్ళని కాలు కింద పెట్టనీయకుండా మర్యాదలు చేసేటోడు. రోజుకో రకం పిండివంటలు చేపిచ్చి కడుపునిండా తినిపించేటోడు. ఎప్పుడూ పొరపాటున గూడా ఎవ్వరినీ విసుక్కునేటోడు కాదు. రంగయ్య వుండేది నగరంలో.

దాంతో నగరంలో పనిబడి వచ్చేటోళ్ళందరూ రంగయ్య ఇంటికే వచ్చేవాళ్ళు. కొంతమంది ఏకంగా పది రోజులూ, ఇరవై రోజులు గూడా తిష్ట వేసేటోళ్ళు.



రంగయ్య గురించి తెలిసి ఎక్కడెక్కడి దూరపు బంధువులు గూడా వరుసలు కలుపుకోని ఇంటికి రావడం మొదలుపెట్టినారు. ఏదో ఒకరోజు రెండు రోజులంటే పరవాలేదు. కానీ రోజు ఎవరో ఒకరు వస్తావుంటే ఎలా... వచ్చినవాళ్ళందరికీ అడిగినవన్నీ చేసిపెట్టలేక రంగయ్య పెండ్లాం కిందా మీదా ఐపోతావుండేది. అదీగాక అందరూ అది కావాలా... ఇది కావాలా... అని అడిగేటోళ్ళేగానీ పనిలో కొంచంగూడా సాయం చేసేటోళ్ళు కాదు. అంతేగాక రంగయ్య సంపాదించేదంతా వాళ్ళకే సరిపోసాగింది. 'పెండ్లాం బిడ్డలు పస్తులున్నా పరవాలేదుగానీ వచ్చినవాళ్ళకి కొంచంగూడా లోటు రాకూడదు" అంటూ రంగయ్య అప్పులమీద అప్పులు చేస్తా మరీ పెట్టసాగాడు. పెండ్లాం ఎంతో నెత్తీ నోరూ కొట్టుకున్నా రంగయ్య పట్టించుకునేటోడు కాదు. ఇది ఇలాగే జరిగితే ఏదో ఒకరోజు రోడ్డు మీద పడడం ఖాయం అనుకుంది రంగయ్య పెండ్లాం. దాంతో బంధువులు ఇంటికి రాకుండా చేయడం కోసం ఒక ఉపాయం పన్నింది.

ఒకసారి ఇంటికి ఐదుగురు బంధువులు వచ్చినారు. రంగయ్య వాళ్ళకి బాగా మర్యాదలు చేసి "కూర్చోండి. బజారుకి పోయి మంచి కోడి తీసుకోని వస్తాను. మద్యాన్నం కూర తిందురుగానీ" అంటూ బజారుకు పోయినాడు. రంగయ్య అట్లా పోయిన కాసేపటికి రంగయ్య పెండ్లాం ఒక మంచి రోకలిబండ తీసుకోనొచ్చి బంధువులకు కనబడేటట్లు దేవుని గదిలో పెట్టి, దానికంతా పసుపు పూసి, బొట్లు పెట్టి పూజ చేయసాగింది. అది చూసి బంధువులు "ఇదేందబ్బా... ఈమె రోకలికి పూజ చేస్తా వుంది. ఇలాంటి పూజ ఎక్కడా చూడలేదే" అనుకోని ఆమె దగ్గరకొచ్చి "ఏందమ్మా... ఏం పూజ చేస్తావున్నావు" అనడిగినారు. దానికామె "మా ఆయనకీ మధ్య బాగా డబ్బు పిచ్చి పట్టుకోనింది. మా ఇంటిపక్కనే ఒక పెద్ద మంత్రగాడున్నాడు. వాడు- 'ఎవరయితే ఈ మంత్రించిన రోకలిబండతో రోజుకొకరి చొప్పున నూటా ఒక్క రోజుల్లో నూటా ఒక్కమంది తలకాయలు పగలగొట్టి... ఆ రక్తంతో అమ్మవారికి అభిషేకం చేస్తారో... వాళ్ళకి అమ్మవారు ప్రత్యక్షమయి అడిగినంత సంపదలిస్తుంది' అని చెప్పినాడు. ఆ రోజు నుండి మా ఆయన ఇంటికొచ్చిన బంధువుల తలకాయలన్నీ పగలగొట్టి పూజ చేస్తా వున్నాడు. నిన్నటికి అరవైమంది పూర్తయినారు. ఈరోజు మీలో ఎవరికి మూడిందో ఏమో" అనింది.

ఆ మాటలు వింటూనే వాళ్ళు అదిరిపడ్డారు. ఆమె ఆగు ఆగంటున్నా వినకుండా గబగబా సామాన్లన్నీ సర్దుకుని పెట్టెలు తీసుకోని బైటకు వురికినారు.

వాళ్ళట్లా బైటికి పోవడం ఆలస్యం రంగయ్య కోడి తీసుకోని ఇంటికి వచ్చినాడు. చూస్తే ఇంకేముంది ఇంట్లో బంధువులూ లేరు, వాళ్ళ సామాన్లూ లేవు.

"ఇదేందే... యాడికి పోయినారు వీళ్ళంతా" అనడిగినాడు.

దానికామె "ఏం చెప్పమంటావు... వాళ్ళకు మనింట్లో రోకలిబండ బాగా నచ్చిందంట. అదివ్వమన్నారు. కొంచంసేపు ఆగండి మసాలా దంచి ఇస్తా అన్నా. దానికే వాళ్ళకు కోపం వచ్చింది. అడిగిన వెంటనే ఇవ్వనందుకు అలిగి పెట్టెలు సర్దుకోని ఎంత పిలుస్తున్నా ఆగకుండా అలాగే వెళ్ళిపోయినారు. ఇదిగో తొందరగా ఇది తీసుకోని పోయి ఇచ్చి రాపోండి" అని రోకలిబండ రంగయ్య చేతిలో పెట్టింది.

రంగయ్య రోకలిబండ తీసుకోని వాళ్ళని వెతుక్కుంటా వేగంగా పోతావుంటే వూరి పొలిమేరల్లో ఐదుగురు పోతా కనబన్నారు. రంగయ్య గట్టిగా "ఆగండి... ఆగండి... ఇదిగో మీరడిగిన రోకలిబండ. తీసుకోండి" అని అరిచినాడు. వాళ్ళు "ఎవరబ్బా పిలుస్తావున్నారు" అని వెనక్కు తిరిగి చూసినారు. చూస్తే ఇంకేముంది... చేతిలో రోకలిబండ పట్టుకోని వేగంగా తమవైపు వురుక్కుంటా వస్తావున్న రంగయ్య కనబడ్డాడు. అంతే... వాళ్ళు అదిరిపడ్డారు.

"రేయ్... వాడు మన తలలు పగలగొట్టడానికి రోకలిబండ తీసుకోని వస్తావున్నాడు. దొరికినామా మనపని అంతే" అంటూ మరింత వేగంగా వానికి దొరకకుండా పారిపోయినారు. అట్లా పారిపోయినవాళ్ళు కనబన్న బంధువులకంతా రంగయ్యకు పట్టిన పిచ్చి గురించి చెప్పడం మొదలుపెట్టినారు. కొద్దిరోజుల్లోనే విషయం బంధువులకంతా తెలిసిపోయింది. భయంతో అందరూ రంగయ్య ఇంటికి పోవడం మానుకున్నారు.

ఎవరన్నా కనబన్నా... పలకరిచ్చినా పలకకుండా తప్పించుకోని పోసాగినారు. ఎందుకట్లా అందరూ ఒక్కసారిగా తనింటికి రావడం మానుకున్నారో రంగయ్యకు ఏమీ అర్థంకాలేదు. రంగయ్య పెండ్లాం మాత్రం తన ఉపాయం పారినందుకు చానా సంతోషించింది.